


# ఇక స్థానిక సమరం

## పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మార్గదర్శకాలు జారీ

- గత పంచాయతీల రిజర్వేషన్ల డేటా సేకరణ
- పాత రిజర్వేషన్లు కొనసాగుతాయా? మారుతాయా?
- ప్రస్తుత పాలకవర్గ పదవీ కాలం 53 రోజులు మాత్రమే
- అన్నీ అనుకున్నట్లు జరిగితే.. జనవరిలోనే పంచాయతీ పోరు

సిద్దిపేట, డిసెంబర్ 8 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల ప్రక్రియ ముగిసి..నూతన ప్రభుత్వం ఏర్పాటైంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. దీంతో అందరి దృష్టి పంచాయతీ ఎన్నికలపై పడింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తుంది. ఎన్నికల కమిషన్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత గ్రామ పంచాయతీల పాలకవర్గం 2024 ఫిబ్రవరి 1వ తేదీతో గడువు ముగియనున్నది. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గడువుకు ముందే ఎన్నికల నిర్వహణ చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికలు కాలానుగుణంగా నిర్వహిస్తారా..? మరి కొద్ది రోజులు గడువును పొడిగిస్తారా..? అనేది వేచి చూడాలి. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం జిల్లా అధికారం యంత్రాంగం తమ పనుల్లో నిమగ్నమైంది. ఎంత మంది సిబ్బంది అవసరం పడుతారు, ఇటీవల శాసనసభ ఎన్నికల్లో ఎంత మంది సిబ్బందిని వినియోగించుకున్నారు. తదితర లెక్కలను తీసే పనిలో జిల్లాల అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ఆయా గ్రామాల రిజర్వేషన్ల డేటాను జిల్లా అధికార యంత్రాంగం క్షేత్రస్థాయి నుంచి సేకరించింది. అన్నింటిని క్రోడీకరించి ఒక నివేదికను సిద్ధం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎక్కువ మొత్తంలో సిబ్బంది అవసరం ఉంటుంది. ఒక్కో జిల్లాలో రెండు లేదా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. ప్రతి 200 మందికి ఒక ప్రిసైండింగ్ అధికారితోపాటు ఒక పోలింగ్ అధికారిని నియమించాల్సి ఉంటుంది. 200 నుంచి 400 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ఇద్దరు పోలింగ్ అధికారులను నియమిస్తారు. 401 నుంచి 650 మంది ఓటర్లు ఉంటే ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించేలా అధికారులు సిద్ధం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలో 650 మంది ఓటర్లు దాటితే రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అక్కడి ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేయడంలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

### ప్రస్తుత పాలక వర్గం పదవీకాలం 53 రోజులే...

ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సిద్దిపేట జిల్లాలో 499, మెదక్ జిల్లాలో 469, సంగారెడ్డి జిల్లాలో 647 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రస్తుత పాలక వర్గం పదవీ కాలం కేవలం 53 రోజులు మాత్రమే ఉంది. 2024 ఫిబ్రవరి 1వ తేదీతో ముగుస్తుంది. కేవలం 53 రోజులు మాత్రమే ప్రస్తుత పాలకవర్గ పదవీకాలం ఉంది. ఈ లోగా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించే విధంగా జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాటు చేస్తుంది. 2019 జనవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. గత ఎన్నికల సమయంలో నూతనంగా పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. దాని ప్రకారం రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ అందుబాటులో ఉంటుంది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పాత రిజర్వేషన్ విధానం కొనసాగిస్తారా..? లేక నూతనంగా మళ్లీ రిజర్వేషన్లు అమలు చేస్తారా..? అనే విషయం ఇంకా తేలాల్సి ఉంది. అన్ని అనుకున్నట్లు జరిగితే...ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు పచ్చజెండా ఊపితే నూతన సంవత్సరం 2024 జనవరిలో పంచాయతీ ఎన్నికల పోరు ఉండనున్నది. మరో వైపు 1 జనవరి 2024 నాటికి 18 ఏండ్లు నిండిన వారు అంతా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లు తెలిపారు.

| ఉమ్మడి మెదక్ జిల్లాలోని పంచాయతీలు | సిద్దిపేట జిల్లాలో | మెదక్ జిల్లాలో | సంగారెడ్డి జిల్లాలో |
|---|---|---|---|
| | 499 | 469 | 647 |



# కమ్మేసిన పొగమంచు

## సూర్యోదయమైనా వీడని పొగమంచు


మంచుతో మునిగిపోయిన కామారెడ్డికి వెళ్లే రోడ్డు


చేర్యాలలో కురుస్తున్న పొగమంచు


హుస్నాబాద్‌టౌన్: హుస్నాబాద్‌లో పొగమంచు కమ్మేయడంతో వాహనదారుల తిప్పలు


సిద్దిపేటలో చలిమంట కాచుకుంటున్న ప్రజలు


సంగారెడ్డి పట్టణంలో కమ్మేసిన పొగమంచు


రుఘురాసంగం: బర్దిపూర్ గ్రామాన్ని కమ్మేసిన పొగమంచు


న్యాల్‌కల్ మండలం హద్నూర్ గ్రామ శివారులోని అల్లాదుర్గం-మెటల్‌కుంట రోడ్డు మార్గంగుండా లైట్లు వేసుకుని వస్తున్న వాహనదారులు


నిజాంపేటలో పంట పొలాలపై కురుస్తున్న పొగమంచు


మెదక్ పట్టణంలో ఉదయం కమ్మేసిన పొగమంచు


కోహీర్: దిగ్వాల్ 65వ జాతీయ రహదారిపై ఏర్పడిన పొగమంచు


చిన్నశంకరంపేటలో పొగమంచు కప్పేయడంతో వాహనదారుల అవస్థలు

- ఉదయం తొమ్మిది గంటలైనా తొలగని మంచుతెరలు
- ఇబ్బందులు పడిన వాహనదారులు
- వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లాను శుక్రవారం పొగమంచు కమ్మేసింది. ఉదయం 10గంటలు దాటినా మంచు మూలంగా ఎవరూ బయట కనిపించలేదు. మంచు, చలితో అన్నదాతలు సైతం పొలాలకు వెళ్లకుండా ఇండ్లలోనే ఉండిపోవాల్సిన వచ్చింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భానుడు కలిపించలేదు. దుకాణాలు తెరుచుకోలేదు. పొద్దంతా మబ్బులతో నిండి ఉండడంతో ఎప్పుడు రద్దీగా ఉండే పట్టణాలతోపాటు గ్రామాలన్నీ బోసిపోయాయి. మంచుతోపాటు చిన్నపాటి చినుకులు సైతం కురవడంతో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు ఒకే చోటికి తరలించి టార్పాలిన్లు కప్పారు. పొగ మంచు మూలంగా ఉదయం నుంచి సాయం కాలం వరకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్యవసరమైతే తప్పా మంచు తగ్గే వరకు ప్రయాణాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఎదురుగా వచ్చే వాహనాలు, మూల మలుపులు, రోడ్డు కూడా సరిగ్గా కనిపించక పోవడంతో హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వచ్చింది.

*– న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, డిసెంబర్ 8*


సిద్దిపేట బైపాస్ రోడ్డులో పొగమంచులో ప్రయాణిస్తున్న ప్రజలు

రేగోడ్‌లో దట్టంగా పొగ మంచు.. ఉదయం 8 గంటలైనా కనిపించని భానుడు



సిద్దిపేట కమాన్: సిద్దిపేట శివారులోని పొలాల్లో కురుస్తున్న మంచు


దుబ్బాక పట్టణంలో పొగమంచులోనే ఇండ్లు, భవనాలు


సిద్దిపేటలో టీ తాగుతున్న ప్రజలు


సిద్దిపేట కమాన్: అయ్యప్ప ఆలయం పొగమంచు


చేర్యాల:మంచులో వాకింగ్ చేస్తున్న వాకర్స్